# ప్రేమ మైకం

- కోలపల్లి ఈశ్వర్

**"పద్మిని అంత పని చేసిందా?" అన్నాడు రంగాచారి గట్టిగా ఓ సిగరెట్టు దమ్ము లాగి... రింగులు రింగులుగా పొగ వదులుతూ.**

"అంతకంటే ఎక్కువే చేసేదేమో... నా అదృష్టం బాగుండి సింపుల్‌గా నా లవ్ లెటర్‌ని పడవగా చేసి... కాలువలో వదిలేసి- ఇంట్లోకెళ్లి పోయింది. విషాద వదనంతో చెప్పాడు గోపాలం.

"మరయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

"పద్మినిని కన్విన్స్‌చేసి నన్ను లవ్ చేయడానికి ఒప్పించాలి... అది నువ్ చేయగలవా?"

"ఈసారి నన్నే ఎత్తి కాలువలోకి విసిరేస్తుంది.. నావల్ల కాదుగానీ, మరెవర్నయినా చూస్కో... నేవస్తా..."సిగరెట్ విసిరేసి బుక్స్ తీసుకుని వెళ్లిపోయాడు రంగాచారి.

దేవదాసులా చూశాడు గోపాలం... వెళుతున్న మిత్రుడి వంక.

"ఎంటి సార్... చిన్న చిన్న సమస్యలని పెద్దగా వర్రీ అయిపోతారూ..." పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ అన్నాడు సర్వర్ సుబ్బారాయుడు నవ్వుతూ.

"అంటే... నువ్వంతా వినేశావన్నమాట..." నొచ్చుకున్నాడు గోపాలం.

"తప్పేముంది సార్... అన్నట్టు మీకో సంగతి తెలుసా? పెద్ద పెద్ద పనులు కొన్ని... చిన్న చిన్న వాళ్లతోనే జరుగుతాయ్... మీ ప్రాబ్లం నాకు తెలుసుకాబట్టి... దానికో సొల్యూషన్ కూడా చెప్పమంటే చెబుతాను."

"ఏ పుట్టలో ఏ పాముందో... చెప్పరాదూ!?"

"సరిగ్గా చెప్పారు... విషయమేంటంటే... మీరనే ఆ పద్మినిగారికి ఓ అన్నయ్య ఉన్నాడు. అతడిని మీరు..."

సుబ్బారాయుడి మాట పూర్తికాకముందే-

"అచ్చిక బుచ్చికలాడి మచ్చిక చేసుకొని, నా ముచ్చట తీర్చుకోవాలి. అంతేగదా నువ్వు చెప్పబోయేది..." అన్నాడు గోపాలం మెరుస్తున్న కళ్లతో.

"ఓర్నీ... భలే, ఇంటెలిజెంట్ కేడీ మొనగాడిలా వున్నారే మీరు... ఇట్టే పట్టేశారు పాయింట్‌ని... నా బంగారు బాబుగారే... నా దసరా బుల్లోడుగారే... అంటూ రెండు చేతులెత్తి ఎగురుతూ మెటికలు విరిచాడు సర్వ్రారాయుడు.

"చిన్న పిల్లాడిలా ఆ తుళ్లింతలాపేసి... నా బావమరిది... అదే... ఆ పద్మిని అన్న ఎవరో... చెప్పు..." అన్నాడు గోపాలం సీరియస్‌గా.


"చెప్పను... తీసుకొచ్చి పరిచయం చేస్తాను..." అన్నాడు రాయుడు హార్లిక్స్ బుజ్జిబాబులా.

⁂ ⁂ ⁂

"ఇతడే బాల సింహా... పద్మినిగారి అన్నయ్య... పరిచయం చేశాడు రాయుడు గోపాలానికి.

"ఆఁ..." అంటూ నోరెళ్లబెట్టాడు గోపాలం అతడిని చూసి.

సన్నగా, బట్టతలతో అతికించినట్టున్న చిన్న మీసంతో... పొలంలో పాత గుడ్డలు



చుట్టిన దిష్టిబొమ్మలా ఉన్నాడతను.

"గ్లాడ్ టూ, మీట్‌యూ..." అన్నాడు బాల సింహ. సింహంలా తల అడ్డంగా విదిలిస్తూ.

అతని బొంగురు గొంతు విని, కొంచెం ప్రక్కగా పేపర్ ప్లేట్స్‌లో మిగిలిపోయిన స్నాక్స్‌ని వెతుక్కుని తింటున్న కుక్కపిల్ల... విచిత్రంగా అతని వంక చూసి కుంయ్‌మని అరుస్తూ పారిపోయింది.

షేక్‌హ్యాండిచ్చిన గోపాలం... చేతికి తాళ్లు చుట్టుకున్నట్టు ఫీలయ్యి... జడుసుకుని చేతిని వెనక్కి తీసుకుని 'హి హ్హిహ్హి అన్నాడు ఏడవలేక నవ్వుతూ.'

"నేను చెప్పానే గోపాలం సారూ అని... ఆయనే ఈయన..." అన్నాడు సుబ్బారాయుడు.

కానీ, అక్కడెవరూ లేరు.

అప్పటికే బాలసింహ... గోపాలం చేయి పట్టుకుని అల్లంత దూరానికి వెళ్లిపోయాడు.

"ఓర్నీ..." అని కేఫ్‌లోకి వెళ్లాడు రాయుడు కట్ చేస్తే... టాంక్‌బండ్.

[illegible] కోక్‌ని నోటిలో పోసుకుని... చివరిబొట్టుని "ప్చ్‌ప్చ్" అని నాలుకతో [illegible]ుపుకుంటున్న బాలసింహని పిచ్చిగా చూశాడు గోపాలం.

'బాలసింహా...' పిలిచాడు నెమ్మదిగా.

"ఊఁ..." టిన్ దూరంగా విసిరేసి తల తిప్పాడు బాలసింహ.

"నీ పేరేంటి... అలా... బాలసింహ... అని?"

"అదా... మరేం లేదు... నేను బాలకృష్ణ వీరాభిమానిని... నా అసలు పేరు సింహాద్రి... అందుకే బాలసింహ అని పేరు మార్చుకున్నాను... నెక్స్‌ట్...

"పద్మిని నీ స్వంత చెల్లెలేనా?"

"మరి? అద్దె చెల్లెలనుకున్నావా? పిచ్చిపిచ్చి ప్రశ్నలు వేస్తే నే వెళ్లిపోతానంతే... అంటూ లేచి పరుగెత్తబోయాడు బాలసింహ.

అతడ్ని గబుక్కున ఒడిసి పట్టుకుని "సారీ... సారీ... అపార్థం చేసుకోకు... తను చాలా అందంగా వుంటుంది కదాని... అలా అడిగానంతే..." అన్నాడు గోపాలం.

"అవును.. అది మా అత్తయ్య పోలిక.. నేను మా పెదనాన్న పోలిక..." అన్నాడు బాలసింహ.

అతడన్నదాంట్లో ఏదో తప్పుడు అర్థం కనిపించినా... నోరు మూసుకున్నాడు గోపాలం.

కాసేపయ్యాక- ఏదో అడగబోతున్న గోపాలంని చెయ్యిపట్టి లేపాడు బాలసింహ.

"ఏయ్... ఎటు?" తనని గొర్రెలా లాక్కెళ్లిపోతున్న బాలసింహని అదుపుచేయడానికి ప్రయత్నిస్తూ అరిచాడు గోపాలం.

"బాలక్రిష్ణ సినిమాకి... టైంలేదు పదా..."

"నేన్రాను... నాకు పనుంది... నువ్వెళ్లు..." అన్నాడు గోపాలం... పక్కనే వున్న బెంచీని చేత్తో పట్టుకుని-

ఒక్క లాగు లాగి... "నీ పర్మిషన్ ఎవడిక్కావాలి" అన్నట్టు ... ముందుకు లాక్కుపోయాడు బాలసింహ గోపాలాన్ని- దబదబమని అడుగులు వేస్తూ.

ఈ రివటగాడికింత బలమెక్కడిదో... అనుకుంటూ మిర్రి మిర్రి చూస్తున్న గోపాలాన్ని... అందుబాటులో ఆగివున్న ఆటోలోకి ఒక్క తోపు తోశాడు బాలసింహ- తనూ లోపలికి దూరుతూ.

"వామ్మో..." అని తూలిపడి సర్దుకున్నాడు గోపాలం.

